ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 16 జూన్ 2024




నరసరావుపేటలోని స్టేడియం వద్ద అన్న క్యాంటీన్(పాత చిత్రం)



అన్న క్యాంటీన్లకు పునర్వైభవం

- పునరుద్ధరణ పనులు చేపట్టిన పురపాలక సంఘాలు
- త్వరలోనే మళ్లీ రూ.5కే అల్పాహారం, రూ.5కే భోజనం
- పేదలకు ఆహార భద్రత కల్పించనున్న కూటమి ప్రభుత్వం


నరసరావుపేటలోని స్టేడియం వద్ద అన్న క్యాంటీన్ నేటి దుస్థితి


నేడు అన్న క్యాంటీన్ లోపల పరిస్థితి

నరసరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు అన్న క్యాంటీన్‌లను మళ్లీ నిర్వహించనుంది. రూ.5కే భోజనం.. అల్పాహారం లభించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి. రానున్న వంద రోజుల్లో పేదలకు ఆహారం అందించే దిశగా ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. అన్న క్యాంటీన్‌లు పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ విధ్వంసంలో శిథిలమైన అన్న క్యాంటీన్‌ల పురుద్ధరణ కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న అన్న క్యాంటిన్‌లను పురపాలక సంఘ అధికారులు శనివారం స్వాధీన పరచుకున్నారు. పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.

క్యాంటీన్‌ల ప్రాంగణాలు పిచ్చిమొక్కలు, దుమ్ముతో నిండిపోయాయి. వీటిని శుభ్రపరిచే పనులు నిర్వహిస్తున్నారు. గతంలో క్యాంటీన్ నిర్వహణకు వినియోగించిన ఫర్నిచర్ చాలాచోట్ల మాయమైంది. ఫ్యాన్‌లు కూడా అపహరించారు. క్యాంటీన్‌ల అద్దాలను ధ్వంసం చేశారు. క్యాంటీన్‌ల రూపురేఖలు మారిపోయాయి. పురపాలక సంఘ అధికారులు క్యాంటీన్‌లను శుభ్రపరిచే పనులు చేపట్టారు. అన్న క్యాంటీన్‌లకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు పురపాలక సంఘాలు పనులు నిర్వహించనున్నాయి.


అన్న క్యాంటీన్‌లో ఆహారం పంపిణీ ఏర్పాట్లు (పాత చిత్రం)

వివిధ శాఖల అధీనంలో

ఉన్న క్యాంటీన్ భవనాలను మునిసిపాల్టీలు స్వాధీనం చేసుకున్నాయి. నరసరావుపేటలోని ఒక క్యాంటీన్ భవనంలో కళాక్షేత్రం ఏర్పాటు చేశారు. దీనిని ఖాళీ చేయించి భవనాన్ని మునిసిపాల్టీ స్వాధీనం చేసుకుంది. మునిసిపల్ కమిషనర్‌లు క్యాంటీన్ భవనాలను పరిశీలించి తాజా పరిస్థితి, ఫర్నిచర్, పరికరాలు తదితర అంశాలపై ప్రాథమిక నివేదికను రూపొందించారు. క్యాంటీన్‌ల పునరుద్ధరణకు పాత డిజైన్ ప్రకారం భవనంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియను మునిసిపాల్టీలు ప్రారంభించాయి. రానున్న వంద రోజుల్లో అన్న క్యాంటీన్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేస్తోంది.

- ప్రభుత్వం పేదలకు అన్న క్యాంటీన్‌ల ద్వారా ఆహార భద్రత కల్పించేందుకు తెలుగుదేశం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లను ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. కనీసం వీటికి భద్రత కూడా కల్పించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌లకు పూర్వవైభవం త్వరలోనే సంతరించుకోనుంది. పేదలకు రూ.5కే అల్పాహారం, అదే ధరకు భోజనం అన్న క్యాంటీన్‌ల ద్వారా అందించనున్నారు. గతంలో అక్షయపాత్ర ఫౌండేషన్ క్యాంటీన్‌లో భోజనం పంపిణీ చేసింది. జిల్లాలోని క్యాంటీన్‌ల ద్వారా ఒక్కో చోట ఐదు వందల మంది కి అల్పాహారం, భోజనం క్యాంటీన్‌ల ద్వారా అందించారు. రుచికరమైన భోజనం, అల్పాహారం రూ.5కే అందించారు. అల్పాహారం ఇడ్లీ, పూరి, ఉప్మా ఇలా రోజుకో రకం క్యాంటీన్ లో ఏర్పాటు చేశారు. భోజనం ఒక కూర, సాంబారు, పెరుగు, రైస్ వడ్డించారు. రూ.15 చెల్లిస్తే ఒక రోజుకు సరిపడా అల్పాహారం, భోజనం క్యాంటీన్ ద్వారా లభించేది. ఒక్కో క్యాంటీన్ సుమారు రూ.39 లక్షల వ్యయంతో నాడు నిర్మించారు.

స్టాక్ లెక్కలేదు.. తూకం సరిలేదు

- ఇదా పేదలకు పంపిణీ చేసేది
- సరకు లెక్కా... మీ లెక్కా త్వరలోనే తేల్చుతా
- ఈసారి వచ్చేప్పటికి అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలి
- లేకుంటే చర్యలు తప్పవని మంత్రి మనోహర్ హెచ్చరిక


తూకాల్లో వ్యత్యాసాలను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి, తెనాలి రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గోదాముల్లో స్టాక్ ఎంతుందో తెలియదు.. అసలు స్టాక్ రిజిస్టర్‌లే లేవు. వచ్చిన సరకు నాణ్యంగా ఉందా.. లేదా అని చూసేవారు లేరు. నాశిరకంగా ఉంటే కాంట్రాక్టర్‌కు వెనక్కిపంపే ప్రయత్నమూ లేదు. ఇంకెందుకు మీరుందంటూ పౌరసరఫరాలశాఖ అధికారులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. సరకుల పంపిణీ మొత్తం ఆపేయాలని, వెంటనే ఆడిట్ చేసి సరకు నిల్వల లెక్కలు తేల్చాలని, దానితోపాటే సరకు నాణ్యతా ప్రమాణాలను తనిఖీచేసి నిర్ధారణ పత్రాలతోసహా వారంలో నివేదిక ఇవ్వాలంటూ ఉన్నతాధికారులను ఆదేశించారు.

శనివారం ఆయన తెనాలిలోని 6 విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొదట వ్యవసాయ మార్కెట్ యార్డులోని బియ్యం నిల్వఉంచిన గోదాములను పరిశీలించారు. బియ్యం బస్తాలకు పురుగుపట్టి ఉండటంపై మండిపడ్డారు. స్టాక్ రిజిస్టర్ అస్తవ్యస్తంగా కనిపించింది. కచ్చితమైన లెక్కలు కనిపించలేదు. దీంతో స్టాక్ వివరాలను యార్డు అధికారులను అడిగినా వారినుంచి సరిగా సమాధానం లేకపోవటంతో మంత్రి వారిపై అసహనం వ్యక్తం చేశారు. త్వరలో మళ్లీ తనిఖీకి వస్తానని, ఆ సమయానికి స్టాక్ వివరాలు, రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటానని వారిని హెచ్చరించారు.

తర్వాత పినపాడులోని ఎం.ఎల్.ఎస్. పాయింట్‌లో నిల్వ ఉంచిన కందిపప్పు, పంచదార, పామాయిల్ ప్యాకెట్‌లను తనిఖీ చేశారు. కందిపప్పు ప్యాకెట్ తూకం వేసి చూస్తే దానిలో అరకిలోకి బదులు 450 గ్రాములే ఉంది. పేదలకిచ్చే సరకుల తూకాల్లో ఇంత వ్యత్యాసమా! అంటూ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పద్మను, ఎం.ఎల్.ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జ్ లక్ష్మిని ప్రశ్నించారు. వారినుంచి సమాధానం లేదు. దీంతో ఆయన ఇక్కడొక్కచోటే కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తీరు ఉంటుందన్న నిర్ధారణకు వచ్చారు. వెంటనే అక్కడి నుంచే ఆ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సరకుల పంపిణీని వెంటనే ఆపేసి, వారంలోగా మొత్తం స్టాక్ వివరాలను లెక్కవేసి ఆడిట్ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గత ప్రభుత్వం చెప్పింది ఒకటైతే, క్షేత్రస్థాయిలో మరోటి జరుగుతుండటంతో మంత్రి ఎండీఎఫ్ వాహనదారుని ప్రశ్నించారు. తర్వాత మంత్రి మనోహర్ విలేకరులతో మాట్లాడారు. పౌరసరఫరాల శాఖలో భారీ అవినీతి జరిగింది. ఇక్కడ పేదలకు అందించే బియ్యం, సరకులను గత ప్రభుత్వంలోని కొన్ని తిమింగలాలు మింగేశాయి. ఒక్క విషయంలోనూ జవాబుదారీతనం లేదు. ఈ కుంభకోణాల్లో బాధ్యులయినవారిని ఎవరినీ వదిలేది లేదు. అంతా బయటకు తీస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఒక్కరోజు పరిశీలిస్తేనే భారీ కుంభకోణాలు కనిపిస్తున్నాయని, సరకు కూడా నాశిరకంగా ఉండటంతో వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సరకుల పంపిణీని ఆపేయాలని, మొత్తం ఆడిట్ చేసి వారంలోగా నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. నాపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు నాకు ఈ శాఖను అప్పగించినందుకు పూర్తిస్థాయిలో శాఖను ప్రక్షళన చేస్తానన్నారు. తనిఖీల్లో గుంటూరు జిల్లా జె.సి రాజకుమారి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి పద్మ, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఎస్పీ రమేష్, ఇతర శాఖల అధికారులున్నారు. వీరితోపాటు స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ఆయన వెంటున్నారు.

జేఎన్‌టీయూపై.. నీలినీడలు


జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

- నరసరావుపేటలో కళాశాలపై వర్సిటి పెద్దల కుట్ర
- అధ్యాపకుల నియామకంలో అంతులేని నిర్లక్ష్యం
- అతిథి అధ్యాపకులే దిక్కు
- నాలుగేళ్లుగా ఇదే తంతు
- ప్రిన్సిపాల్‌నూ బదిలీ చేశారు
- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న వర్సిటీ అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళా శాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ పెద్దలు పనిచేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడం లేదు. కళాశాలలో ఏ ఒక్క సమస్యా పరిష్కారానికి నోచుకోవడం లేదు. నూతన భవనాల నిర్మాణంలోనూ అలసత్వాన్ని ప్రదర్శి స్తోంది. చివరకు విద్యార్థులకు బోధనా సమస్యల పరిష్కారాన్ని గాలికొదిలేసింది. అధ్యాపకులను నియమించడంలో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమైంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంజనీరింగ్ విద్యాభివృద్ధి లక్ష్యంతో నాడు సీఎం చంద్రబాబు నాయుడు జేఎన్‌టీ యూ ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పారు. ఈ కళాశాలను 2016 లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించింది. సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ బ్యాంచ్‌లు నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్రాంచ్‌కి 60 సీట్లు ఉన్నాయి. కళాశాలలో దాదాపు వెయ్యిమందికి పైగా విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తు న్నారు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ.7.11 కోట్ల వార్షిక బడ్జెట్ ను నాడు కేటాయించింది. తొమ్మిది మంది ప్రొఫెసర్‌లు, 53 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, 18 అసోసియేట్ ప్రొఫెస ర్‌లను కళాశాలకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది. ఈ మేరకు అధ్యాపకులను యూని వర్సిటీ నేటికీ నియమించలేదు.

అతిథి అధ్యాపకులతో కాలక్షేపం

పర్మినెంట్ అధ్యాపకులను నియమించాల్సిన యూ నివర్సిటీ అతిథి అధ్యాపకులతో కాలం వెళ్ళబుచ్చుతోంది. 73 మంది అధ్యాపకుల కొరత నెలకొంది. నామమాత్రంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి చేతులు దులు పుకుంది. కనీసం అధ్యాపకులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అల సత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గెస్ట్ లెక్చరర్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఆ అధ్యాపకులు అప్పుడప్పుడు వచ్చి తరగతులు నిర్వహిస్తుంటారు.

గత ఏడాది మిగిలిన 80 సీట్లు

అధ్యాపకుల కొరత వెంటాడుతుండటంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఇక్కడ చేరకపోవడంతో తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యా పకులు లేకపోడం తో ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటంలేదు. దీంతో గత ఏడాది సీట్లు మిగిలిపోయాయి. ప్రతిభకలిగిన పేదవిద్యార్థులకు ఎంతగానే ఉపయోగపడాల్సిన కళాశాలను నిరుపయోగంగా వర్సిటీ మార్చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్లు వెచ్చించి భవనాలను నిర్మించారు. అధ్యాపకులను భర్తీ చేయడాన్ని విస్మరించడం గమనార్హం. కళాశాలలో ఐదు బ్రాంచ్‌లలో 300 సీట్లు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో 220 సీట్లు భర్తీ అయ్యాయి. 80 సీట్లు మిగిలిపోయాయి.

ఏడుగురే అధ్యాపకులు.. వీరిలో ప్రిన్సిపల్ బదిలీ

పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ అది కూడా ప్రిన్సిపాల్. ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావును కూడా రెండు రోజుల క్రితం బదిలీ చేశారు. ప్రొఫెసర్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు 53 మందికి గాను నలుగురు మాత్రమే ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్‌లు 18 మందికి గాను కేవలం ఇద్దరే ఉన్నారు. ఇద్దరిలో క్రీడలకు సంబంధించి ఒక అసోసియేటెడ్ ప్రొఫెసర్ ఉన్నాడు. కొత్త ప్రిన్సిపల్‌ను నియమించారని చెబుతున్నారు. 73 మంది అధ్యాపకుల నియమాకాల విషయంలో వర్సిటీ పెద్దలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

ఎమ్మెల్యేలు.. ఎంపీలు చొరవ తీసుకోవాలి

కాకినాడ జేఎన్‌టీయూ నిర్లక్ష్యానికి బలైపోతున్న నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజ నీరింగ్ కళాశాలను కాపాడటంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు.. ఎంపీలు చొరవ తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరు తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో స్థాపించి, అధ్యాపకుల నియమకాలకు ఉత్తర్వులు విడుదల చేయడంతోపాటు ఇందుకు బడ్జెట్‌కు కేటాయింపులు జరిగాయి. నాడు సీఎంగా చంద్రబాబు నాయుడు కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మళ్లీ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో కళాశాల అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు ఆశపడుతున్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను నియమించే విధంగా ఎమ్మెల్యేలు.. ఎంపీలు కృషి చేయాల్సి ఉంది.

కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కళాశాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పనులు సాగుతున్నాయి. వసతి గృహాలు అందుబాటులోకి రాలేదు. మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. తరగతి గదులు, ల్యాబ్‌లను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలి. నరసరావుపేట పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో కళాశాల ఉండటం, వసతిగృహాలు క్యాంపస్‌లో లేకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన వసతి గృహాల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి.

విద్యాశాఖలో.. తాత్సారం

- విద్యాకిట్ల, ఎయిడెడ్ అక్రమాలపై నివేదికలతో సరి
- అధికారి ఒంటెత్తు పోకడలపై ఉపాధ్యాయుల ఆగ్రహం
- ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సంఘాల నిర్ణయం



గుంటూరు(విద్య), జూన్ 15: లక్షల విలువైన విద్యా కిట్లు సమగ్ర శిక్షలోని ఓ పీవో నిర్లక్ష్యం వల్ల ఎలుకల పాలు.. ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కై లక్షలు వసూలు చేసి పోస్టుల భర్తీ.. స్పాట్ వాల్యుయేషన్‌లో ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు నిలిపివేయడం.. ఓ అత్యున్నత అధికారి ఉపాధ్యాయులపై నోరుపారేసుకోవడం.. ఓ ద్వితీయశ్రేణి అధికారి బహిరంగ అక్రమాలు.. ఇలా విద్యాశాఖలో వెలుగుచూస్తోన్న ఘటనలు అనేకం. అయితే ఇప్పటి వరకు ఆయా ఘటనలపై నివేదికలు సిద్ధం చేసినా సంబంధిత వ్యక్తులపై చర్యలులేవు. ఓ ఉపాధ్యాయురాలిపై అసభ్యంగా ప్రవర్తించినా వైనంపై తూతూమంత్రంగా విచారణ చేసి నివేదికను అటకెక్కించారు. గడిచిన రెండుమూడేళ్లుగా విద్యాశాఖలో జరిగిన అనేక పరిణామాలు, ఘటనలపై ఉపాధ్యాయులు, సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో తాత్సారంపై ఉపాధ్యాయులు నిరసనలకు సిద్ధవుతున్నారు. ఈ క్రమంలో తొలుత ఆయా సంఘటనల్ని ఓ నివేదిక రూపంలో తయారు చేసి నూతన ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రికి ఇవ్వాలని నిర్ణయించారు.

- గతంలో సమగ్రశిక్షలో పనిచేసిన పీవో జిల్లాకు వచ్చిన విద్యాకిట్లు పంపిణీ చేయకుండా శివారులోని ఓ పాఠశాలకు తరలించారు. ఆ తర్వాత సంవత్సరంలో అయినా ఇండెంట్ తగ్గించి ఉన్న వాటిని సరఫరా చేయాలి. కానీ వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో దాదాపు రూ.5 లక్షల విలువైన విద్యాకిట్లు పనికిరాకుండా పోయాయి. దీనిపై విచారణ చేసి నివేదిక కలెక్టర్‌కు ఇచ్చినా చర్యలు శూన్యం.
- ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తూతూమంత్రంగా పరీక్ష నిర్వహించి భారీ మొత్తం డబ్బులు ఇచ్చిన వారికి యాజమాన్యాలు పోస్టులు కట్టబెట్టాయి. ఇలా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో దాదాపు 20పైగా పోస్టులు భర్తీచేశారు. ఒక్కో పోస్టుకు రూ.20 లక్షలపైగా వసూలు చేశారని సమాచారం. ఇందులో విద్యాశాఖలో కీలక అధికారులకు పోస్టుకు రూ.3 లక్షల చొప్పున అందినట్లు ప్రచారం సాగింది. దీనిపై విచారణ పెండింగ్‌లో ఉంది.
- ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల సమయంలో విద్యాశాఖకు చెందిన ఓ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరించారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ జాబితాను ఆ అధికారి వైసీపీ నేతలకు అందించారు. ఇందుకు రూ.5 లక్షలు చేతులు మారినట్లు అప్పట్లో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుల వెళ్లాయి. దీనిపై ఆర్జేడీ విచారణ చేపట్టినట్లు సమాచారం.
- జిల్లా విద్యాశాఖలో ఓ ద్వితీయశ్రేణి అధికారి తనిఖీల పేరుతో పాఠశాలలకు వెళ్ళడం.. చిన్నచిన్న తప్పులకు భారీ మొత్తంలో జరిమానాలు వేయడం పరిపాటిగా మారింది. తనిఖీలకు వెళ్లే ప్రత్యేక మెనూ సిద్ధం చేయాలని హుకుం జారీ చేసేవారిని ఆయనపై ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరులోని ఓ ఎయిడెడ్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలితో ఆయన అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ చేసిన సమయంలో సదరు అధికారి సెలవుపెట్టి తప్పించుకున్నారని తెలిసింది.
- ఇటీవల ముగిసిన పది స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి ఉపాధ్యాయులకు రూ.4 లక్షల వరకు డీఏ చెల్లించలేదు.
- విద్యాశాఖలో వైసీపీ ప్రభుత్వంలో జిల్లాకు వచ్చిన ఓ అత్యున్నత అధికారి ఉపాధ్యాయ సంఘాల నాయకుల్ని, ఉపాధ్యాయులతో అవమానకరంగా మాట్లాడేవారన్న ఫిర్యాదులు ఉన్నాయి.


ఉండవల్లిలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మహిళ సమస్యలు తెలుసుకుంటున్న లోకేశ్

6లో..

అక్రమాలు తేల్చండి

- అంజుమన్ కమిటీపై విచారణకు ముస్లింల పట్టు
- వైసీపీ హయాంలో జేబు సంస్థగా మార్చుకున్న ముస్తఫా
- కేర్ టేకర్ కమిటీ సభ్యుల రాజీనామాల ఆమోదం

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు ఆధీనంలోని అంజుమన్ సంస్థకు జిల్లాలో పలుచోట్ల ఆస్తులున్నాయి. గతంలో సేవాభావంతో బాధ్యతలు నిర్వహించి సంస్థకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలను అధ్యక్షులు నిర్వహించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో అంజుమన్ -ఎ-ఇస్లామియా కమిటీ అక్రమాలకు నెలవుగా మారింది. గతంలో పాలకవర్గం ఆధీనంలో ఉన్న ఈ కమిటీని మాజీ ఎమ్మెల్యే ముస్తఫా తన జేబు సంస్థగా మార్చేశారు. తన సోదరుడినే అధ్యక్షుడిగా నియమించి కేర్ టేకర్ కమిటీని ఏర్పాటు చేసి ఇంచుమించు ఐదేళ్ల పాటు కొనసాగించారు. ఈ క్రమంలో ఎన్నో అక్రమాలు జరిగాయని పలుమార్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఇప్పటికైనా కమిటీపై విచారణ జరిపించాలని ముస్లిం మైనార్టీ సంఘాలు కోరుతున్నాయి. అన్యాక్రాంతమైన ఆస్తులను కూడా వెనక్కు తీసుకోవడంతో పాటు ఎవరైతే నిధులను దుర్వినియోగం చేశారో వారితోనే కక్కించాలని డిమాండ్ చేస్తున్నాయి.

గతంలో విచారణలతో సరి

గతంలో ఒకటి, రెండు సార్లు వక్ఫ్‌బోర్డు స్పాట్ విచారణ నిర్వహించినా ఏ ఒక్కరి పైనా చర్యలు చేపట్టలేదు. అంజుమన్ సంస్థకు జిల్లాలో పలుచోట్ల ఉన్న అనేక ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా తన పలుకుబడిని ఉపయోగించి వక్ఫ్‌బోర్డు సీఈవో కార్యాలయం నుంచి కేర్ టేకర్ కమిటీని నియమింపచేశారు. ఆ కమిటీకి అధ్యక్షుడిగా తన సోదరుడు కర్నుమాని నియమించేలా చేశారు. అది మొదలు ఎన్నికలు జరగకుండా ఐదేళ్లు కాలయాపన చేశారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనందించేవారు. అలాంటిది అధ్యక్షుడి హోదాలో కర్నుమా పేద విద్యార్థుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేసేలా వివాదాస్పద నిర్ణయం తీసుకుని అమలు చేశారు. అనుమతులు లేకుండానే షాదీకానా పునరుద్ధరణ చేశారు. రంజాన్, బక్రీద్ పండగల సమయంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించుకునే నగరంపాలెంలోని ఈద్గా స్థలాన్ని వాణిజ్య ప్రదేశంగా మార్చేశారు. బిర్యానీ పాయింట్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లకు లీజులకు ఇచ్చారు. అలానే ఈద్గా ప్రహరీని కూల్చి కొందరికి మేలు చేయాలని ప్రయత్నించారు. అయితే ముస్లిం నేతలు అడ్డుపడటంతో అది నిలిచింది. చిన్నమౌలాపంజాలోనూ ఓ స్థలం అన్యాక్రాంతం అయ్యేలా చేసేందుకు లేఖ ఇచ్చారు. కాగా వక్ఫ్‌బోర్డు సీఈవో ఆదేశాల మేరకు కేర్ టేకర్ కమిటీ సభ్యులు రెండు రోజుల క్రితం రాజీనామాలు సమర్పించారు. అయితే ఆ కమిటీ హయాంలో జరిగిన అక్రమాల మాటేమిటని ముస్లిం సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి అనగానిని కలిసిన ఏపీ జేఏసీ నాయకులు

● రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని పెంచేందుకు కృషి ● రాష్ట్రాభివృద్ధిలో జేఏసీ ఉద్యోగులు అండగా నిలవాలి ● మంత్రి అనగాని



రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్

రేపల్లె, జూన్ 15: రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగులు అందరూ కష్ట పడి పనిచేసి రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని పెంచేందుకు నిరంతరం కృషి చేస్తామని ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్ తెలిపారు. శనివారం రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఏపీజేఏసీ సంఘ నాయకులు మంగళగిరిలో కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ఉద్యోగస్తులు కృషి చెయ్యాలని ఆకాంక్షించారు. నూతన ప్రభుత్వానికి జేఏసీ నాయకులు అండగా నిలిచి రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని జేఏసీ రేపల్లెను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ సెక్రటరీ పలిశెట్టి దామోదర్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, పుట్టా జాహ్నవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ.అనుపమ, గరికపాటి బ్రహ్మయ్య, సత్యన్నారాయణ, ఏపీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు జనకుల శ్రీనివాసరావు, ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగానిని కలిసిన సర్వే ఉద్యోగుల సంఘం నాయకులు

రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.చిరంజీవరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, సలహాదారులు రౌతు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.సాయిబాబు, ఉపాధ్యక్షులు పి.గోపాల్, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ప్రజల కోసం లోకేశ్ ప్రజాదర్బార్

● తొలి అడుగుతోనే యువనేత సంచలన నిర్ణయం ● ఉండవల్లి నివాసంలో ప్రజలను కలుసుకున్న లోకేశ్



యువతి సమస్య తెలుసుకుంటున్న లోకేశ్

తాడేపల్లి, జూన్ 15: గత ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సేవా కార్యక్రమాల్లో మంగళగిరి నియోజకవర్గ ప్రజల మనసులు గెలిచిన యువనేత, మంత్రి నారా లోకేశ్ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇటీవల ఎన్నికల్లో రికార్డు స్థాయి మెజారిటీతో ఘన విజయం సాధించిన నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో మంగళగిరి ప్రజల కోసం తమ ఇంటి ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు నారా లోకేశ్ శనివారం ఉదయం 8 గంటల నుంచి ఉండవల్లిలోని తన నివాసంలో స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల సమయంలో లోకేశ్ ప్రజలకు అందుబాటులో ఉండరని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేశారు. వాస్తవానికి గత ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి పత్తా లేకుండా పోగా ఓడిపోయిన లోకేశ్ నిత్యం ప్రజల్లో ఉంటూ 29 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచారు. ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో గెలిచిన లోకేశ్ నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువగా ఉండాలని ప్రజాదర్బార్ నిర్వహించాలని నిర్ణయించారు. ఉండవల్లిలో ఉన్నప్పుడు రోజూ లోకేశ్ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. లోకేశ్ వేసిన ఈ తొలి అడుగు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకం కానుంది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంతవరకు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తక్షణమే సమస్యల పరిష్కా రానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని లోకేశ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి ప్రజల కోసం ప్రజాదర్బార్ నిర్వహించానని, నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న రోజుల్లో ప్రజలను కలుస్తానని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చాలా సేవాకార్యక్రమాలు చేశానని భారీ మెజార్టీతో గెలిచిన నాపై మరింత బాధ్యత ఉందని చెప్పారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతాం

● వరికిపూడిశెల, లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తి చేస్తాం ● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, జూన్ 15: పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన తరువాత శనివారం మొట్టమొదటిసారిగా ఆయన భారీ విజయోత్సవ ర్యాలీతో మాచర్ల నియోజకవర్గంలో అడుగుపెట్టారు. మాచర్ల పట్టణ శివారులోని రాయవరం జంక్షన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘన విజయాన్ని అందించిన మాచర్ల నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ రాష్ట్రానికి అభివృద్ధి కావాలి. బానిస సంకెళ్ల నుంచి బయటపడాలనే ఉద్దేశ్యంతో ప్రజలంతా ఎన్డీఏ కూటమికి అఖండ మెజార్టీతో 164 సీట్లు అందించి ఆశీర్వదించారన్నారు. తమ ప్రభుత్వం రాజధాని, నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రత్యేకంగా వరికపూడిశెల ప్రాజెక్ట్ పూర్తి చేస్తామన్నారు. బుగ్గవాగు నుంచి మాచర్ల పట్టణానికి మంచినీటిని అందిస్తామన్నారు. పేదలు, గర్భిణుల కోసం పట్టణంలో మెరుగైన వైద్యసేవలను అందించేందుకు 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పల్నాడు ప్రాంతానికి వీలైనన్నీ విద్యా సంస్థలు తీసుకొస్తామన్నారు. మాచర్ల పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలో మహిళల కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో అనుపు, జెర్రివాగు, పేటసన్నిగండ్ల, ధర్మవరం లిఫ్ట్ ఇరిగేషన్లను పూర్తి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయాలకు దూరంగా ఉంటానన్నారని, మాట మీద ఎంత వరకు నిలబడతారో చూద్దామన్నారు. దుర్గి మిర్చి యార్డును అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కుడి కాలువ ద్వారా అవకాశం ఉన్న చోట్ల లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తి చేస్తామన్నారు. వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని, పద్ధతి మార్చుకోకపోతే చూస్తూ ఊరుకోమని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు.

జగన్ మద్యం అక్రమాలు, అరాచకాలపై
దర్యాప్తు అవసరం

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రత్తిపాటి



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియ జేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 15: మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మద్యం అక్రమాలు, అరాచకాలపై లోతైన దర్యాప్తు అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కేవలం తన అక్రమార్జన కోసం లక్షల మంది ప్రజల ఆరోగ్యాన్ని బలిపీఠం పైకి నెట్టిన దుర్మార్గులకు తగిన శాస్త్రి జరిగితీరాలన్నారు. ఇదే సమయంలో ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని గుల్లచేసిన జే బ్రాండ్ మద్యం దుష్పరిణామాలపై గ్రామ గ్రామాన అధ్యయనాలు చేయించి తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్‌టీఆర్ భవన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్తిపాటి పుల్లారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి ఐదు సంతకాలతోనే రాష్ట్ర వ్యాప్తంగా సంబరాల వాతావరణం తీసుకువచ్చిన చంద్రబాబుకు ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఐదు నిర్ణయాల ద్వారా సీఎం అంటే ప్రజాసేవకుడు అని చంద్రబాబు చాటిచెప్పారని ప్రత్తిపాటి కితాబు ఇచ్చారు. ఐదు సంవత్సరాల క్రితం ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలుపెట్టిన సైకోకు, మొదటి రోజే ప్రజల మనసులు చూరగొన్న సంక్షేమ సారథికి మధ్యనున్న తేడాను అందరూ గమనిస్తున్నారన్నారు.

టీడీపీ కార్యకర్తపై
మోపిదేవి అనుచరులు దాడి



దాడికి గురైన బొమ్మిడి నాగరాజు

రేపల్లె, జూన్ 15: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభావానికి గురికావటంతో జీర్ణించుకోలేని మోపిదేవి అనుచరులు శనివారం ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన టీడీపీ నాయకులపై హత్యాయత్నం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపట్నం గ్రామంలో టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ అనుచరుడు బొమ్మిడి నాగరాజుపై మోపిదేవి అనుచరులైన మోపిదేవి చరణ్, కన్నా నాగబాబు, మచ్చా మల్లికార్జున, బి.వెంకటవర్మ, సన్నీ అనే వ్యక్తులు కర్రలు, రాడ్లతో తీవ్రంగా గాయపరిచారు. చుట్టుపక్కల వారు చూసి కేకలు వెయ్యటంతో వైసీపీ మూకలు పారిపోయారు. వళ్ళంతా రక్తంతో నాగరాజును హుటాహుటిన రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స అందించారు. రూరల్ సీఐ మల్లికార్జునరావు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న దాడిగల కారణాలపై నాగరాజును అడిగి తెలుసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో
ముగ్గురు గుంటూరు జిల్లా వాసుల మృతి

చెన్నై, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గుంటూరు జిల్లా వాసులు మృతి చెందారు. గుంటూరు జిల్లాకు చెందిన శశిధర్ (39), తన బంధువులతో కలసి తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయానికి కారులో బయలుదేరారు. తిరువణ్ణామలై జిల్లా వసూలు గ్రామం వద్ద అదుపు తప్పిన వాహనం రోడ్డుపక్కనే వున్న చింతచెట్టును వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో వాహనం నుజ్జునుజ్జు కాగా, శశిధర్ భార్య కల్యాణి(33), కుమార్తె రిషిత(8), బంధువు రవి(24) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవింగ్ చేసిన శశిధర్, ఆయన కుమారుడు రామచంద్ర(11), బంధువు ఈశ్వరి(62) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారు శిధిలాల మధ్య వున్న మృతదేహాలను వెలికితీసి, క్షతగాత్రులను తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలించారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో
స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య), జూన్ 15: ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(వెంకటగిరి) కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ వారిచే సర్టిఫికెట్స్ జారీ చేస్తారు. ఈ సంస్థలో దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించబడతాయి. ఇతర సమాచారం కోసం, స్పాట్ అడ్మిషన్ల కోసం 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

టిప్పర్ చెట్టుకు ఢీకొని
డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ లక్ష్మయ్య

వినుకొండటౌన్, జూన్ 15: ప్రమాదవశాత్తు టిప్పర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని శివాపురం సమీపంలోని మామిడి తోటవద్ద శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా, తిపురాంతకం మండలం ఎండగ్లారివారి పాలెం చెందిన కొల్లి లక్ష్మయ్య (45) గ్రామ సమీపంలోని ఇటుకల మట్టిని టిప్పర్ సాయంతో వినుకొండలో అన్‌లోడ్ చేశారు. తిరిగి స్వగ్రామానికి ప్రయాణిస్తుండగా శనివారం తెల్లవారుజాము శివాపురం సమీపంలోని మామిడి తోటవద్ద ప్రమాదవశాత్తు టిప్పర్ చెట్టుకు ఢీ కొనడంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య పేరమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఎమ్మెల్యే నసీర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న రవాణాశాఖ అధికారులు

తూర్పు ఎమ్మెల్యేకు రవాణా శాఖ అధికారుల శుభాకాంక్షలు

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌కు రవాణా శాఖ అధికారులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. పొన్నూరు రోడ్డులోని నసీర్ కార్యాలయానికి వెళ్లి వారు మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా శాఖ జిల్లా కమిషనర్ షేక్ కరీమ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గంగాధర ప్రసాద్, మల్లేశ్వరి, సౌజన్యలు నసీర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

రేషన్ డీలర్స్‌కు అండగా ఉంటాం: నసీర్

రేషన్ డీలర్స్‌కు ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందని, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు. తూర్పు కార్యాలయంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు తుమ్మల గాంధీ, రాజేశ్వరరావు, బాలరాజు నాయక్, జిలాని, దుర్గ, పద్మజా, బుజ్జి, సుదాకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టం ఉల్లంఘించకూడదు

● జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ

● ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు



ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, జూన్ 15 : బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లాలో గోవధ నిషేధ చట్టం ఉల్లంఘించకుండా ఆహ్లాదకర వాతావరణంలో పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ స్పష్టం చేసారు. ఈ నెల 17న జరిగే బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. జంతు సంరక్షణా ఆపరేషన్‌కు సంబంధించి జిల్లా నోడల్ అధికారిగా సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజుని నియమించినట్లు తెలిపారు. జిల్లాలో బక్రీదు పర్వదినం సందర్భంగా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో సజావుగా పండుగ నిర్వహించుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద గట్టి భద్రతా చర్యలు తీసుకొని ఎలాంటి అవాంతరాలు లేకుండా పోలీసు అధికారులు, సిబ్బంది పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా జిల్లా స్థాయిలో మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ, పశు సంవర్థక, రవాణా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జంతువధ చట్టాలు ఉల్లంఘన జరుగకుండా ప్రత్యేకంగా నిఘా పెట్టి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకమైన ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మత పెద్దలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. జిల్లాలో చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులను బైండోవర్ చేయటం జరుగుతుందని తెలిపారు. గోవధ నిషేధ చట్టం 2017 ప్రకారం గోవులను వధించడం చట్టరీత్యా నేరంగా పరిగణించాలని తెలిపారు. ఎక్కడైనా ఏదైనా అసాంఘిక, అనైతిక కార్యక్రమాలు జరుగుతుంటే డయల్ 112 లేదా లోకల్ పోలీస్ వాట్సాప్ నెంబర్ 8688831568కి తెలియజేయాలని కోరారు. బక్రీద్ వేడుకలకు సంబంధించి ఏవైనా విచారణలు, ఫిర్యాదుల కోసం నోడల్ అధికారి, క్రైమ్స్ డీఎస్పీ ఎ.శివాజిరాజుకు 8688831476లో తెలియజేయాలని కోరారు.

గోవధ నిషేధం : కలెక్టర్

గుంటూరు సిటీ, జూన్ 15 : బక్రీద్ సందర్భంగా గోవధకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. గోవధపై నిషేధం ఉన్నందున చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శనివారం పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవులను, చూలుతో ఉన్న పశువులను, మూడు నెలల వయసు కలిగిన దూడలను వధించరాదని అన్నారు.

పరిశోధనలు చేస్తేనే ఉజ్వల భవిత

● ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ శాస్త్రి

గుంటూరు(విద్య), జూన్ 15: గణిత రంగంలో పరిశోధనలు చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సీ.శాస్త్రి తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథమ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్' అనే అంశంపై మూడు రోజుల పాటు హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శనివారం ముగించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సీ.శాస్త్రి మాట్లాడుతూ విభిన్న వర్గాల వినియోగదారులు, వారి అభిరుచులు, వారి అవసరాలను గుర్తించే క్రమంలో సమాచారాన్ని సేకరించడం... వాటిని క్రోడీకరించి వర్గీకరిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్ రంగాలలో పరిశోధనలు పెరిగినట్లైతే మానవాళికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా నోవార్టిస్ కంపెనీ డేటా అనలిస్ట్ డాక్టర్ ఎం.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆచార్య శాస్త్రి తదితరులు

వైద్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గుంటూరు (మెడికల్) జూన్ 15 : దేశీయ వైద్య రంగంలో పరిశోధనలకు మరింత ప్రాధాన్యత పెరగాలని ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శనివారం గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో గ్రేస్ అనాటమీ హాల్‌లో 'గుడ్ క్లినికల్ ప్రాక్టిస్' అనే అంశంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి చెందిన దేశాలు వైద్య పరిశోధనలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, కాని మన దేశంలో ఇవి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

కొత్తగా వస్తున్న పలు రకాల జబ్బులకు మందులు, వైద్య చికిత్సలను ఆవిష్కరించాలంటే వైద్య పరిశోధనలే కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కే శంకర్ తదితరులు ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో మెడికల్ పీజీ విద్యార్థులు హాజరయ్యారు.

జాబులు ఇచ్చేది.. పెట్టుబడులు తెచ్చేది చంద్రబాబే

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జాబులు ఇచ్చేది.. పెట్టుబడులు తెచ్చేది చంద్రబాబే అని, రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని, అన్ని వర్గాలకు సమన్యాయం, సుపరిపాలన ఒక్క ఎన్డీయే ప్రభుత్వం వలనే అవుతుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీపై సంతకాలు చేసి విశ్వసనీయత చాటుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతగా తెలుగుయువత విద్యార్థులతో కలిసి ఆమె ర్యాలీ చేశారు. లాడ్జిసెంటర్ అంబేద్కర్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం 'థాంక్యూ సీఎం సర్' పేరుతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి బాధ్యతలు స్వీకరించిన వెంటనే హామీలను నెరవేరుస్తూ మొదటి 5 ఫైళ్ల ఫైన సంతకాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేశ్ విశ్వసనీయత చాటారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతగా ఐదు రోజులపాటు ఆయా లబ్ధిదారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఐదేళ్లలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 6 లక్షల ఉద్యోగాలు పూర్తిగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ 'జాబులు ఇచ్చేది బాబే-జాబులు తెచ్చేది బాబే' అని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావటానికి ప్రతి ఏటా మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను వంచించారన్నారు.



భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, డేగల, మన్నవ తదితరులు

చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఇచ్చినహామీ మెగా డీఎస్సీపై మొదటి సంతకాన్ని పెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేశారని నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ కొనియాడారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, జోన్ 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్‌కృష్ణ, కార్యదర్శులు సుఖవాసి శ్రీనివాసరావు, దామచర్ల శ్రీనివాసరావు, ముత్తినేని రాజేష్, టీడీపీ, జనసేన, బీజేపీ పలు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, డీఎస్సీ అభ్యర్థులు, తెలుగుయువత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పర్సంటేజీలు కోసమేనా బిల్లుల చెల్లింపులో జాప్యం!

● నిధులు వచ్చినా నాన్చుతున్న పౌరసరఫరాల సంస్థ

● కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేస్తామంటున్న రేషన్ డీలర్లు

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా పౌరసరఫరాల సంస్థ రేషన్ డీలర్లకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేసినా జిల్లా అధికారులు వాటిని ఇవ్వడం లేదు. జిల్లాలోని ఐదు మండలాల్లోని రేషన్ డీలర్లకు 2016 నుంచి నిలిచిపోయిన మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలకు రేషన్ సరుకుల సరఫరాకు సంబంధించిన కమీషన్‌ని ఆ సంస్థ ఇటీవలే విడుదల చేసింది. ఆయా సరుకుల సరఫరా చేసిన డీలర్లలో ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు బకాయిలు చెల్లించాలి. వీటి కోసం కొన్ని సంవత్సరాలుగా డీలర్లు ఆందోళనలు, పోరాటాలు చేశారు. ఎట్టకేలకు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వీటికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయగా వాటిని జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయం చెల్లించడం లేదు. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలని రేషన్ డీలర్ల సంఘం నాయకులు నిర్ణయించారు.

తాడికొండ, ఫిరంగిపురం, పెదకాకాని, గుంటూరు అర్బన్ తదితర మండలాల్లోని రేషన్ డీలర్ల ద్వారా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలు, సంక్షేమ వసతిగృహాలకు పౌరసరఫరాల సంస్థ సరుకులను సరఫరా చేయించింది. బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, నూనె వంటి సరుకులను పంపిణీ చేయించింది. అయితే ఇందుకు సంబంధించి కమీషన్‌ని మాత్రం గత ఎనిమిదేళ్లుగా డీలర్లకు చెల్లించడం లేదు. దీనిపై రేషన్ డీలర్ల సంఘం నాయకులు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను గతంలో పలుమార్లు కలిసి మొర పెట్టుకొన్నప్పటికీ ఫలితం లేకపోయింది. అయినప్పటికీ డీలర్లు ఆయా సరుకులను సరఫరా చేస్తూనే వస్తున్నారు. తమకు రావాల్సిన మొండి బకాయిలు విడుదలయ్యాయన్న విషయం తెలిసి డీలర్లు సంతోషించారు. అయితే అంతలోనే వాటిని సంబంధిత అధికారులు విడుదల చేయకుండా నాన్చుతుండటంపై ఆవేద న చెందుతున్నారు. పౌరసరఫరాల సంస్థలో ఏ బిల్లు చెల్లింపుకైనా అక్కడి సిబ్బంది పర్సంటేజీలు తీసుకోవడం వ్యవస్థీకృతమైపోయింది. ఈ కారణంగానే బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్న అనుమా నాలను డీలర్ల సంఘం నాయకులు వ్యక్తపరుస్తున్నారు. కొద్ది రోజుల్లోనే అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగబోతోన్నాయి. ఈ నేపథ్యంలో అందినకాడికి వెనకేసుకొనే పనిలో ఉన్నారన్న ఆరోపణలు కూడా వారిపై వస్తున్నాయి. ఈ వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకొని బిల్లులు విడుదలయ్యేలా చూడాలని సంఘం నాయకులు కోరుతోన్నారు.



నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

శ్రేష్ఠ ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక చికిత్సలు

● ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గొట్టిపాటి

గుంటూరు(తూర్పు), జూన్ 15 : గుంటూరు గుజ్జనగుండ్లలోని శ్రేష్ఠ ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక పద్ధతిలో ఐవియూస్ విధానం ద్వారా గుండె చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున తెలిపారు. ఇటీవల కాలంలో యువత ఎక్కువ మంది గుండె జబ్బుల బారీన పడి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అంతేగాక ఎక్కువ మందికి గుండె రక్త నాళాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని చెప్పారు. వీటిని తొలగించడానికి గతంలో యాంజియోగ్రామ్ ద్వారా స్టంట్లు అమర్చి అడ్డంకులు తొలగిస్తారని అన్నారు.

ఇప్పుడు ఐవియూస్ ద్వారా స్టంట్లు అమర్చడం వల్ల రోగులకు దీర్ఘకాలంలో తిరిగి రక్తనాళాల్లో పూడిక ఏర్పడటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయని వివరించారు. స్టంటు కూడా సరైన పరిమాణంలో తగిన విధంగా ఖచ్చితంగా అమర్చవచ్చని తెలిపారు. దీంతో మెరుగైన ఫలితాలను సాధించవచ్చని అన్నారు. ఈ చికిత్సలు శ్రేష్ఠ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

'నేను బడికి పోతా' విజయవంతంగా నిర్వహించాలి : డీఈవో

గుంటూరు(విద్య), జూన్ 15 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశా లను పెంచేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని డీఈవో పి.శైలజ సూచించారు. డీఈవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయి నుంచి వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ, పంచాయతి శాఖ, డిప్యూటీ విద్యాశాఖాధికారులు, బాలకార్మిక నిరోధక సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశాలు జారీ చేసిందని, జులై 12 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. 6-14 ఏళ్ల లోపు ఉన్న పిల్లలందరూ బడుల్లో ఉండేలా చూడాలని, వంద శాతం ప్రవేశాలు ఉండాలని సూచించింది. బడి మానేసిన పిల్లల్ని సీఆర్పీలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఇంటింటికి ప్రచారం చేయాలని డీఈవో శైలజ సూచించారు.

జీవో నెం.107, 108లను రద్దు చేయాలి : డాక్టర్ ఆలా

గుంటూరు (మెడికల్) జూన్ 15 : రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సగం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్నారై కేటగిరి సీట్ల పేరుతో అమ్మకానికి వీలుగా గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 107, 108లను తక్షణం రద్దు చేయాలని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అమరావతి రోడ్‌లోని ఆలా ఆసుపత్రిలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఉన్న 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ సీట్ల ఒప్పందం కూడా ఈ ఏడాదితో ముగుస్తోందని, దీని వల్ల ఏపీ విద్యార్థులు తెలంగాణలో సుమారు 300 సీట్లు కోల్పోతున్నట్లు ఆయన వివరించారు. ఈ నష్టాన్ని జీవో నెంబర్ 107, 108 రద్దుతో పూడ్చవచ్చని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పందించి వెంటనే ఈ జీవోలను రద్దు చేయాలని డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పీ సీతారామ్ ప్రసాద్, కోశాధికారి కే నరసింహారావు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా బోధన

గుంటూరు(విద్య),జూన్ 15: చదవుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా టీజేపీఎస్ కళాశాల నిర్వహిస్తున్నామని కార్యదర్శి కేవీ బ్రహ్మం అన్నారు. కళాశాలలో అడ్మిషన్లపై శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, విద్యతో పాటుగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ వంటివి ఉన్నాయన్నారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు ప్రముఖ కంపెనీలను పిలిపించి మెగా జాబ్ మేళా నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే విధంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కళాశాలలో ఇంటర్‌తో పాటుగా, డిగ్రీ, పీజీ వంటివి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, వాసవి విద్యానిధి కమిటీ సెక్రటరీ పోలిశెట్టి నాగసుందరం, వాసవి విద్యానిధి అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యం, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు

వినూత్న ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు దిక్సూచి

గుంటూరు(విద్య), జూన్ 15 : విద్యార్థి ఆలోచనలకు నూతన ఆవిష్కరణలు, అంకుర పరిశ్రమల స్థాపనల వైపు ప్రోత్సహిస్తూ అధ్యాపక బృందం విద్యార్థులకు తగిన రీతిలో శిక్షణ అందిస్తే వారు అద్భుతాలను సృష్టిస్తారని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇంక్యూబేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ సి.చంద్రమౌళి అన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో 'థింక్ బియాండ్ ఫ్యాకల్టీ వర్క్ షాప్ ఆన్ వాలిడేటింగ్ ఐడియాస్' అనే పేరుతో అధ్యాపక బృందానికి శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కళాశాల ఐటిబిఐ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవిపి చంద్రశేఖర్, సిఈఓ డాక్టర్ మహేంద్రవర్మ, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి పెమ్మసాని జన్మదిన శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న పెమ్మసాని

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వంటి నిబద్ధత కలిగిన నాయకుడు, అనుభవజ్ఞుడితో కలిసి కేంద్ర మంత్రివర్గంలో పనిచేయ డం గర్వంగా ఉందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డికి శనివారం ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కలిసి పెమ్మసాని అల్పాహార విందులో పాల్గొన్నారు. కేంద్ర సహాయ మంత్రిగా ఇటీవలే బాధ్యతలు అందుకున్న పెమ్మసానికి కిషన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర, దేశ భవిష్యత్తు దృష్ట్యా అందరం సమష్టిగా కలిసి పని చేద్దామని పెమ్మసానితో కిషన్‌రెడ్డి అన్నారు.

చంద్రబాబు తొలి సంతకాలు అభివృద్ధికి మలుపు

● డాక్టర్ నిమ్మల శేషయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నిమ్మల శేషయ్య

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తొలి 5 సంతకాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలుగుదేశం పార్టీ నాయకుడు డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. డీఎస్సీలో 16 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ వలన నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపడ మే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో బోధన సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వలన నిత్యం వేలాది మంది పేదలకు ఆకలి తీరుతుందన్నారు. పెన్షన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచడం వల్ల ఎందరో జీవితాల్లో వెలుగు వస్తాయన్నారు. గత ఐదు సంవత్సరాలుగా హామీలు ఇచ్చే ప్రభుత్వాన్ని చూశామని ఇప్పుడు ప్రజల కోసం పాటుపడే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో ప్రతిరోజు అందుబాటులో ఉండాలనే నిర్ణయం అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. చంద్రబాబు, పవన్, బీజేపీల అండతో రాష్ట్రంలో ఇక అభివృద్ధి పరుగులు పెట్టడం తథ్యమన్నారు. కూటమి ఇచ్చిన అన్ని హామీలను అమలుపరచడం ద్వారా ప్రజా జీవితాల్లో కాంతి నిండుతుందన్నారు.

విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే

లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్లిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.



పాలిటెక్నిక్ డిప్లొమాలు

తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్లు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిదాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్, ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ల అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

ఉన్నత చదువులు: లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

దిక్సూచి DIKSUCHI

సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 272

జాబ్ కార్నర్

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: **22**
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22**
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10**
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2**
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30**

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: 16

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 19

వెబ్‌సైట్: scclmines.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Ul6jhodలో చదవండి.

వర్కింగ్ స్టిల్‌తో ఉస్తాద్



పవన్‌కల్యాణ్; డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. శనివారం డైరెక్టర్ హరీశ్ శంకర్ ఈ సినిమా వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు.

మొక్కు తీర్చుకున్న సాయితేజ్

తన మేనమామ పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా హీరో సాయిదుర్గాతేజ్ తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సాయిదుర్గాతేజ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన విషయం తనకు తెలియదని ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో నిహారిక కొణిదెల అన్నారు



పవన్‌కు బహుమతి

పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి.. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి హోదానూ దక్కించుకున్నారు పవన్‌కల్యాణ్. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తన అన్నయ్య చిరంజీవి ఇంటికి వెళ్లారు. అక్కడ చిరంజీవి సతీమణి సురేఖ పవన్‌కు విలువైన మాంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. "తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తావని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాం" అని చిరంజీవి, సురేఖ అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సురేఖ, అన్నా లెజినోవా, పవన్ కలిసి ఫొటో దిగారు.

'గరం గరం'



నాని సరికొత్త పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న సినిమా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'గరం గరం' అంటూ సాగే ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

'భైరవ యాంథమ్'

ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏ.డీ' నుంచి ఓ ప్రోమో సాంగ్ విడుదలైంది. 'భైరవ యాంథమ్' అని సాగే ఈ పాటను భారతదేశపు అతిపెద్ద పాటగా మేకర్స్ తెలిపారు. 21 సెకండ్స్ పాటూ సాగిన ఈ ప్రోమో సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఆలపించారు. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశాపటాని కథానాయికలు.



ఆగస్టులో ఇస్మార్ట్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.



మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా...

సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వం వహిస్తున్నారు, పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ "ఇటువంటి ఫీల్ గుడ్ చిత్రాలు తీస్తున్నందుకు చిత్రబృందాన్ని అభినందిస్తున్నాను. ఈ మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.



ఈ విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది

సుధీర్‌బాబు నటించిన లేటెస్ట్ చిత్రం 'హరోంహర'. మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటించారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుబ్రమణ్యం.జి, సుమంత్ నాయుడు.జి మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే తండ్రీ కొడుకుల సెంటిమెంట్, కథానాయకుడి పాత్ర నన్ను బాగా ఆకర్షించాయి. వెంటనే సినిమాను నిర్మించడానికి ఒప్పుకున్నా. ఈ సినిమా విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా థియేటర్లు నిండిపోవడం చూసి ఎంతో ఆనందంగా ఉంది. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు, మిత్రులు, ఇండస్ట్రీ పెద్దలు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటి గురించి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తాము" అని చెప్పారు.



నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PySH7NE లో చదవండి.

ప్రేక్షకులు షాక్ అవుతారు



'నా జీవితంలో మరిచిపోలేని సినిమా 'ఏ'. 26 ఏళ్ల క్రితం ఈ సినిమా విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో, ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నాను. ఈ నెల 21న ఈ చిత్రాన్ని తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లలో 'ఏ' సినిమాను చూసి ఇప్పటి ప్రేక్షకులు షాక్ అవుతారు' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఏ' చిత్రాన్ని నిర్మాత లింగం యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇక రాజకీయాల జోలికి వెళ్లను



ఇక నుంచి తాను రాజకీయ ప్రేరేపిత కథాంశాలతో సినిమాలు చేయనని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చుట్టూ అల్లుకున్న వివాదాస్పద అంశాలతో పలు సినిమాలు చేస్తూ వార్తల్లో నిలిచారు వర్మ. ఇప్పుడు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆయన తోక ముడిచినట్లు కనిపిస్తోంది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయాలపై సినిమాలు చేయడం మానుకుంటున్నాను. ఇక నుంచి దేవుళ్లపై సినిమాలు చేస్తాను అని చెప్పారు.

అన్ని చోట్లా ఆదరిస్తున్నారు



కన్నడ హీరో యశ్ నటించిన ఓ చిత్రం తెలుగులో 'రాజధాని రౌడీ' పేరుతో విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మా 'రాజధాని రౌడీ' చిత్రాన్ని 94 కేంద్రాల్లో విడుదల చేశాం. అన్ని చోట్లా మంచి వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి డీ.శ్రీనివాసరావు

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

● న్యాయాధికారి డీ.శ్రీనివాసులు

తెనాలి క్రైం, జూన్ 15: సత్వర కేసులు పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ఇతోధికంగా తోడ్పడుతుందని 11వ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు డీ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం కోర్టు ప్రాంగణంలో ఆయన పట్టణ న్యాయవాదుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో న్యాయాధికారి మాట్లాడుతూ ఆదిపత్య పోరు, తన మాట నెగ్గాలనే పోకడ, కుటుంబంలో ఏర్పడే చిన్నపాటి వివాదాలు వంటి కేసుల్లో కోర్టులకు వస్తున్నవారి ఇటీవల ఎక్కువగా ఉంటుందన్నారు. దీని వలన వారి విలువైన కాలం, దనాన్ని నష్టపోతున్నారు. న్యాయవాదులు ఇలాంటి విషయాల్లో కక్షిదారులకు అవగాహన కల్పించాలి. కేసులను సామరస్యంగా వారు బేషజాలకు పోకుండా పరిష్కరించుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్య కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేకవర్ధన్, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య జ్వాల శ్రీశ్రీ

తెనాలి అర్బన్, జూన్ 15 : సామాజిక చైతన్యాన్ని రగిల్చిన జ్వాలా కిరణం శ్రీశ్రీ యువతకు స్ఫూర్తిదాయకమని శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ అధ్యక్షులు రంగిశెట్టి రమేష్ పేర్కొన్నారు. నాజరుపేటలోని కళావేదికలో శనివారం శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాడుకబాషలో రచనలు చేసి సామాన్యుడి ఇంటిముగింట సాహితీ రంగ వల్లులు దిద్దిన మహాకవి అని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల జనులకు శ్రీశ్రీ రచనలు దోహదపడ్డాయని సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేశాయన్నారు. బొల్లిముంత కృష్ణ, ఆళ్ళ నాగేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, యోహాను, రఘునాధరావు, సుజాత, బీమేశ్వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పన చంద్రబాబుకే సాధ్యం

● తెనాలి ఏరియా టీచర్స్ ఫోరం నిర్వాహకుడు వెంకటేశ్వరావు

తెనాలి, మారీసుపేట జూన్ 15: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని తెనాలి ఏరియా టీచర్స్ ఫోరం నిర్వాహకుడు బీ.వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక చెంచుపేట అమరావతి ఫ్లాట్స్‌లోని ఎన్టీఆర్ ఇండోర్‌స్టేడియంలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 16347 పోస్టులతో మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం శుభ పరిమాణమన్నారు. రాష్ట్ర కోచ్‌ల అసోసియోషన్ కోశాధికారి నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు హయంలోనే క్రీడల అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో కే. రంగాజీ, డీబీ సుబ్బారావు, పుట్టా జనార్ధనరావు, కే. శ్రీధర్, సీఎచ్ వినయ్ కుమార్, పీ.రవిబాజు, శరత్‌బాబు గోపి, కేశవగోపి తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుతో

న్యాయవాదుల సంబరాలు

తెనాలి, మారీసుపేట జూన్ 15: ల్యాండ్ టైటిల్ చట్టంను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రద్దు చేయడంతో న్యాయవాదులు శనివారం నెహ్రూ రోడ్డులోని కుర్రా రాఘవయ్య కాంప్లెక్స్‌లో న్యాయవాది వేములపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిఠాయిలను పంపిణీ చేసి, పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసగౌడ్, తిరుమలశెట్టి రామకృష్ణ, టి కొండయ్య, డి గోపినాద్, అడ్వకేట్ గుమస్తా శంకర్, వై మృత్యుంజయరావు, డీ.సాంబశివరావు, పీ.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు సమగ్రాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, జూన్15: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో పొన్నూరు సమగ్రాభివృద్ధికి పాటుపడతామన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించటంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు శ్రమ ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేవిధంగా కూటమి భాగస్వామ్యంతో ముందుకు సాగుతామన్నారు. కేంద్రంలో బీజేపీ సహకారంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పొన్నూరు అభివృద్ధికి కావలసిన సహకారాన్ని కోరనున్నట్లు తెలిపారు. తన విజయాన్నికి కృషి చేసిన బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వరికూటి సుధాకర్, కలపాల శ్రీనివాసరావు, చెరుకూరి తిరుపతిరావు, పద్మనాభం, నాగమల్లేశ్వరి, గోవాడ వెంకట కృష్ణారావు, వడ్రాణం ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌తో బీజేపీ నేత వనమా నరేంద్ర తదితరులు

ఆటోనగర్ ఏర్పాటుకు సహకారం .. ఆటోనగర్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ హామీ ఇచ్చారు. శనివారం పొన్నూరు పట్టణంలోని శాశ్వత ఆటోనగర్ సాధన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను చింతలపూడి ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఆటోనగర్ ఏర్పాటు అవస్యకతను ఎమ్మెల్యేకు వివరించగా ఇచ్చిన హామీ వేరకు ఆటోనగర్ సమస్యకు పరిష్కారం చూపుతాన్నారు.


మున్నంగిలో ఇసుక గుట్టలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

నిల్వచేసిన ఇసుక గుట్టలు సీజ్

కొల్లిపర, జూన్ 15 : మండల పరిధిలోని చివలూరు, మున్నంగి గ్రామాల్లో అనధికారకంగా నిల్వ ఉన్న రెండు ఇసుక గుట్టలను సీజ్ చేసినట్లు మైనింగ్ శాఖ డీడీ చంద్రమోహన్ తెలిపారు. శనివారం మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్ ఇసుక కమిటీ బృందంతో అనధికారకంగా ఉన్న ఇసుక గుట్టలను పరిశీలించారు. ఈసందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ చివలూరు, మున్నంగిలో నిల్వవున్న ఇసుక గుట్టలను సీజ్‌చేసి తహసీల్దార్ శ్రీనివాసులకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక నిల్వచేయడం నేరమనివారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీకర్, జిల్లాఎస్ఈబీ అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీపీవో శ్రీదేవి, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం, ఎన్విరాన్మెంట్ ఇంజనీరు నారాయణ, జిల్లా ఉపరవాణా కమిషనర్ కరీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కళ్యాణచక్రవర్తి, రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పొన్నూరుటౌన్, జూన్15 : ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో జరిగింది. చింతలపూడి గ్రామానికి చెందిన మండె రవీంద్ర మూడురోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు రవీంద్రను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

షారోన్ స్కూల్ డైరెక్టర్ బెనర్జీ మృతి

తెనాలి అర్బన్, జూన్ 15: పట్టణంలోని షారోన్ టాలెంట్ స్కూల్ డైరెక్టర్ కే.శ్యామ్ బెనర్జీ (58) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గత 25 ఏళ్ళుగా భార్య మేరి బెనర్జీతో కలిపి ఆయన స్కూల్ నడుపుతున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చేవారు. ఆయన మృతిపట్ల పలు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపి భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతానికి పాడి పశువు మృతి

పొన్నూరుటౌన్, జూన్15: పంట పొలాల్లో మేత మేయటానికి వెళ్లిన పాడి పశువుపై కరెంటు తీగ పడటంతో ఆ పాడి పశువు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామానికి చెందిన పుప్పాళ్ల మార్కండేయులు వడ్డిముక్కల గ్రామం శివారులో పశువులను మేపుతుండగా, సమీపంలో విద్యుత్ తీగ తెగి ఓ పాడి పశువుపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన ఆ పశువు సంఘటన స్థలంలోనే మృతి చెందింది. పశువుమృతితో రూ.లక్ష నష్టంవాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

చోరీకి విఫలయత్నం

పొన్నూరుటౌన్, జూన్15: పట్టణంలోని భావనగర్ కాలనీలో చోరీకి విఫలయత్నం జరిగిన సంఘటన వెలుగుచూసింది. భనగర్ కాలనీ సమీపంలోని ఫైర్ స్టేషన్ వద్ద ఓ ఇంట్లో మద్దాల శివరామకృష్ణ నివశిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం శివరామకృష్ణ కుటుంబంతో సహా కాశీ యాత్రకు వెళ్లారు. శుక్రవారం రాత్రి శివరామకృష్ణ ఇంటిలోకి కొందరు చొరబడి చోరీకి విఫలయత్నం చేసారు. శనివారం ఉదయం తాళ్లాలు పగలకొట్టి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శివరామకృష్ణ బంధువులు సహాయంతో చోరీ జరిగిన గృహాన్ని పోలీసులు పరిశీలించారు. ఇంటి లోపల బీరువా తెరవటానికి ప్రయత్నించి రాకపోవటంతో ఇంట్లోని వస్తు సామగ్రిని చిందరవందరగా పడేసి వెళ్లినట్లు గుర్తించారు. విలువైన వస్తువులు ఏవీ చోరీకి గురికాలేదని బంధువులు గుర్తించారు. ఈ ఘటనపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హెల్మెట్‌లు ప్రదర్శిస్తున్న పోలీసులు

హెల్మెట్ తప్పక ధరించండి

● డీఎస్పీ రమేష్‌బాబు

తెనాలి అర్బన్, జూన్ 15 : వాహన ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని డీఎస్పీ రమేష్‌బాబు సూచించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ ధారణపై శనివారం ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీసులు హెల్మెట్‌లు ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ ధరిండటంలో నిర్లక్ష్యం వహించరాదని వాహనదారులకి సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ సుధాకర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సంపూర్ణ శాంతి హోమం

తెనాలి, మారీసుపేట జూన్ 15: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమంను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడవ రోజు శనివారం హస్త నక్షత్రం వారిచే గణపతి పూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ ఋత్వికులచే యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరావు, చుండూరు లోకనాధం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను అరికట్టాలి : బైరి నరేష్

పొన్నూరుటౌన్, జూన్15: నూతన ప్రభుత్వంలో అక్రమ కేసులను అరికట్టాలని సామాజిక ఉద్యమ కారుడు డాక్టర్ బైరి నరేష్ కోరారు. శనివారం పట్టణంలో న్యాయవాది పొందుగల చైతన్య ఆధ్వర్యంలో దళిత బహుజనులపై దాడులు అనే అంశంపై ప్రజా సంఘాల సహకారంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన బైరీ నరేష్ మాట్లాడుతూ నిమ్న వర్గాలపై దాడులు తగ్గటం లేదని ఆరోపించారు. దాడులు ప్రతిదాడులు విష సంస్కృతికి నూతన ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలన్నారు. సమావేశంలో రెంజర్ల రాజేష్, పెరికల రమణయ్య, మాకాని బాలు, యడ్ల వందనం, దేవరపల్లి సునీల్, బలభద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బైరీ నరేష్

గోవధ నిషేధం

తెనాలి, మారీసుపేట జూన్ 15: పట్టణ పురపాలక సంఘ పరిధిలో గోవధ నిషేధమని తెనాలి పట్టణ మునిసిపల్ కమిషనర్ బీ.శేషన్న తెలిపారు. స్థానిక వహబ్ రోడ్డులోని మజీద్ వద్ద శనివారం ముస్లిం మతపెద్దలతో కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ చట్టం 1977 ననుసరించి ఆవులను, ఒంటెలను వధించుట నేరమని తెలిపారు. సోమవారం జరగనున్న బక్రీద్ పర్వదినం సందర్భంగా తెనాలి పట్టణంలో ఎటువంటి గోవధ చేయకుండా ముస్లింలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమిషనర్ కే.అనూష, ఆరోగ్యాధాకారి డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

తెనాలి అర్బన్, జూన్ 15 : పట్టణంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తితో పాటు కొనుగోలు చేస్తున్న వారిని శనివారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు గంజాయిపై దృష్టి సారించారు. శుక్రవారం ఆర్టీసి బస్టాండ్ వద్ద కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్ నుంచి తెనాలి సాలిపేటలో నివశిస్తున్న పరాన్‌నస్కర్ మగ్గం పనులు చేస్తుంటాడు. మహ్మద్ షఫీ సర్దార్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న పొట్లాలుగా బస్టాండ్, రైల్వే స్టేషన్ ఏరియాలో విక్రయిస్తుంటాడు. ఐతానగర్‌కు చెందిన పురుషోత్తం నాని గంజాయికి బానిసగా మారాడు. నస్కర్‌తో కలసి గంజాయి విక్రయిస్తున్న సమాచారం తెలుసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని టూటౌన్ సీఐ సుధాకర్ తెలిపారు.